ప్రజాశక్తి

బుధవారం 12 మార్చి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

న్యాయం జరిగే వరకూ పోరాటం

◆ విసిఐసి నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించకుండా పనులా ? ◆ బల్క్ డ్రగ్ పార్కుతో తీవ్ర నష్టం

◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

◆ బాధిత గ్రామాల్లో జోరుగా ప్రజా చైతన్య యాత్ర

సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై లోకనాథం తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

విశాఖ - చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల భూములకు పూర్తి పరిహారం, పునరావాసం కల్పించకుండా పనులెలా చేపడతారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. పిడిఎఫ్ గ్రామాల్లో ఇళ్లు, భూములు, చెట్లకు పూర్తి పరిహారం, మేజర్లకు ప్యాకేజీ చెల్లించకుండా చేపడుతున్న పనులను అడ్డుకోవాలన్నారు. న్యాయమైన పరిహారం కోసం నిర్వాసితులు చేసే పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. మంగళవారం నక్కపల్లి మండలం కాగిత, పాటిమీద, మూలపర్రు, తమ్మయ్యపేట, రాజయ్యపేట, బుచ్చిరాజుపేటల్లో జరిగిన ప్రజా చైతన్య యాత్రలో ఆయన పాల్గొన్నారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం డి పట్టా భూములకు జిరాయితీ భూముల వలే పరిహారం చెల్లించాలన్నారు. పూర్తి పరిహారం చెల్లించకుండా భూములు అప్పగించబోమని చెప్పాలన్నారు. న్యాయమైన పరిహారం, పునరావాసం, ప్యాకేజీ దక్కే వరకూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పరిహారం చెల్లింపులో చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులను జైల్లో పెట్టాలన్నారు. నిర్వాసితులను బెదిరించి భూములు, ఇళ్లు స్వాధీనం చేసుకునే అధికారులకు కలెక్టర్ నోటీసులు జారీజేయాలన్నారు. మిట్టల్ వంటి పెట్టుబడిదారులకు అమ్ముడుపోయి ప్రజలపై జులుం ప్రదర్శిస్తే ఐక్య పోరాటాలతో తిప్పికొడతామన్నారు. దౌర్జన్యంగా భూమి, ఇళ్లు ఖాళీ చేయించే

వృద్ధురాలి గోడు వింటూ..

మిగతా 2లో..

విశాఖ - పాట్నా మధ్య హోలీ ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల రద్దీని నియంత్రించే క్రమంలో విశాఖపట్నం - పాట్నా మధ్య మూడు ట్రిప్పుల ప్రత్యేక రైళ్లు నడపాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో 08537 విశాఖపట్నం - పాట్నా హోలీ ప్రత్యేక రైలు మార్చి 16, 23, 30 తేదీలలో ప్రతి ఆదివారం రాత్రి 19:30 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 21:00 గంటలకు పాట్నా చేరుకుంటుంది. అదేవిధంగా 08538 పాట్నా - విశాఖపట్నం హోలీ ప్రత్యేక రైలు మార్చి 17, 24, 31 తేదీలలో ప్రతి సోమవారం రాత్రి 22:30 గంటలకు పాట్నాలో బయలుదేరి బుధవారం తెల్లవారుజామున 3:50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ప్రయాణికులు ఈ ప్రత్యేక రైళ్ల సేవలను వినియోగించుకోవాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు

పలువురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలలో రెండో పట్టణ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా మిగతా 2లో..

షోకాజు నోటీసును ఉపసంహరించుకోవాలి

▸ వార్త 4లో..

బిజెపితో రాజ్యాంగానికి భంగం

▸ వార్త 8లో..

హయగ్రీవ భూముల్లో హెచ్చరిక బోర్డులు

▸ వార్త మెయిన్‌లో..

స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్రపై అవగాహన కల్పించండి

మాట్లాడుతున్న పట్టాభిరామ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజలకు స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్రపై అవగాహన కల్పించాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ జివిఎంసి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జివిఎంసి కార్పొరేటర్లు, అధికారులతో కలిసి జివిఎంసి ప్రధాన కార్యాలయంలో స్వచ్ఛ విశాఖ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్త నుంచి సంపద దిశగా విశాఖను అభివృద్ధి పరచాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో ముందుగా జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్ వివరించిన వేస్ట్ మేనేజ్మెంట్, పారిశుధ్య పనుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల విభజన, సేకరణ, తరలింపు పనితీరును, నీటి సరఫరా విభాగం ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజినీర్ కెవియన్.రవి యుజిడి సివరేజ్ నెట్‌వర్క్ కవరేజ్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్వహణ తదితర అంశాలపై వివరించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను పట్టాభిరామ్ తిలకించారు. అనంతరం ఆయన పలు సూచనలు చేశారు. విశాఖ నగరంలో వేస్ట్ మేనేజ్మెంట్, పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని, భవిష్యత్తు కార్యాచరణ దిశగా సస్టైనబుల్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రామాణికంగా ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లను పూర్తి స్థాయిలో నిర్వహించాలని అన్నారు. ఈ-వేస్ట్, పేపర్, ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం ద్వారా ఆర్థిక అభివృద్ధిని పెంచుకోవచ్చన్నారు. సి అండ్ డి వేస్ట్ ప్లాంట్‌ను వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. ఇంటింటి నుండి విభజించిన వ్యర్థాల సేకరణ, వాహనాల ద్వారా తరలింపు, వాటి బరువు మిగతా 2లో..

రేషన్ పంపిణీలో అలసత్వం వద్దు

◆ ఆహార పదార్థాలను పరిశుభ్రంగా, నాణ్యంగా అందించండి ◆ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు దేవి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్/సీతమ్మధార : రేషన్ సరుకుల పంపిణీ వ్యవస్థలో ఎలాంటి జాప్యమూ లేకుండా లబ్ధిదారులకు సకాలంలో సరుకులు అందజేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు గంజిమాల దేవి అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని పలు రేషన్ డిపోలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, మధ్యాహ్న భోజనం పథకాల అమలును పరిశీలించిన ఆమె సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. పంపిణీ ప్రక్రియలో పొరపాట్లు తలెత్తితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పౌర సరఫరాల అధికారిణి కల్యాణి, ఇతర అధికారులతో కలిసి ఆశీల్ మెట్ట సర్కిల్ - 2లోని రేషన్ డిపోను ఆమె పరిశీలించారు. కార్డుదారుల వివరాలు అడిగి తెలుసుకుని సరుకుల పంపిణీలో పారదర్శకత పాటించాలని సూచించారు. అనంతరం కప్పరాడలోని

సరుకులను పరిశీలిస్తున్న దేవి

అక్షయపాత్ర ఫౌండేషన్, యుపిహెచ్‌సి కేంద్రాలను సందర్శించి భోజన నాణ్యతపై ఆరా తీశారు. జివిఎంసి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి, పిల్లలకు స్వయంగా రాగిజావ అందజేశారు. విద్యార్థులతో ముచ్చటించి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరించారు. అలాగే, 54వ వార్డు నలంద నగర్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

రేషన్ పంపిణీలో అలసత్వం వద్దు

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అందిస్తున్న పోషకాహారం, టేక్ హోమ్ రేషన్, రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో నాణ్యతా ప్రమాణాల తనిఖీ నిర్వహించి, కఠిన నిబంధనలను పాటించాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం మేఘాద్రి గెడ్డలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులాన్ని సందర్శించి విద్యార్థుల విద్యాభ్యాసం, 2023-24లో ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత వివరాలను ప్రధానోపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. గురుకులంలోని భోజనశాల, వంటశాలను పరిశీలించి, బాలికలకు అందిస్తున్న ఆహార నాణ్యతపై పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మమేకమై, వారితో భోజనం చేసి వారి అభిప్రాయాలను స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో ఐసిడిఎస్ అర్బన్ సిడిపిఒలు రమణకుమారి, శ్రీలత, సెక్టార్ సూపర్‌వైజర్ జెఎన్‌టి.జ్యోతి, తూనికల కొలతల శాఖ, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు, రేపు అనకాపల్లి జిల్లాలో పర్యటన

అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు జి.దేవి ఈ నెల 12, 13 తేదీల్లో అనకాపల్లి జిల్లాలో పర్యటించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి తెలిపారు. 12న విశాఖపట్నం జిల్లా పర్యటన అనంతరం అనకాపల్లి జిల్లాకు చేరుకుంటారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, చౌకధర దుకాణాలు, సరుకులు పంపిణీ వాహనాలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేస్తారని, మధ్యాహ్న భోజన పథకం కింద పోషకాహార కార్యక్రమాల అమలును పరిశీలిస్తారని తెలిపారు.

పలువురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ

విధులు నిర్వహిస్తున్న బి.తిరుమలరావును భీమిలి లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు, సిటీ స్పెషల్ బ్రాంచిలో విధులు నిర్వహిస్తున్న పి.పైడయ్యను మూడో పట్టణ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా భీమిలి లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.సుధాకర్‌ను విశాఖపట్నం రేంజ్ విఆర్‌కు సరెండర్ చేశారు.

స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్రపై అవగాహన కల్పించండి

ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని, అలాగే మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్) కేంద్రాలను ప్రారంభించాలని, నగరంలో పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా విశాఖ నగరం మరింత సుందరంగా అభివృద్ధి చెందడమే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల నుండి పెట్టుబడులు వచ్చి రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జునరావు, టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంత లక్ష్మి, బిజెపి ఫ్లోర్ లీడర్ గంకల కవిత, పలువురు కార్పొరేటర్లు, జివిఎంసి అదనపు కమిషనర్లు డివి.రమణమూర్తి, ఎస్ఎస్.వర్మ, పర్యవేక్షక ఇంజినీర్లు, డిఓహెచ్‌ఎం.దామోదర రావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, సహాయ వైద్యాధికారులు, శానిటరీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రామిరెడ్డి

వైద్య సమయంలో ఇబ్బంది పెట్టొద్దు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిజిహెచ్‌ఎస్‌లో వైద్యం పొందుతున్న లబ్ధిదారుడిని రిఫరల్ ఆసుపత్రికి సిఫార్సు చేసిన సందర్భంలో అక్కడ లబ్ధిదారుని రిఫరల్ లెటర్ కోసం నిర్బంధించరాదని విశాఖపట్నం సిజిహెచ్‌ఎస్ బెనిఫిషరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కె.రవిబాబు, కెవిడి.స్వామి అన్నారు. మంగళవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో విశాఖపట్నం సిజిహెచ్‌ఎస్ లబ్ధిదారుల ప్రథమ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబర్లు, డబ్ల్యూసి 1, 2 లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమ్మేళనానికి కెవిడి స్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిజిహెచ్‌ఎస్‌లో లేని టెస్టులు, ప్రొసీజర్లు కూడా క్రెడిట్ పద్ధతిలో చేయాలని డిమాండ్ చేశారు. వెల్‌నెస్ సెంటర్లు జారీచేసిన రిఫరల్ లెటర్స్ ఎంప్యానల్డ్ ఆసుపత్రిలో స్కాన్ చేసుకొని ఒరిజినల్ తిరిగి లబ్ధిదారునికి ఇవ్వాలన్నారు. ఈ సమ్మేళనంలో ప్రభుత్వ మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెవి.రామిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని సందేశం ఇచ్చారు. సౌత్ జోన్స్ ఉపాధ్యక్షులు రఘు, లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు బిడి.రాజు, ఎంఆర్‌డి.రాజు పాల్గొన్నారు.

హయగ్రీవ భూములను 22/ఎలో చేర్చాలని వినతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎండాడలోని హయగ్రీవ భూములను 22/ఎలో చేర్చాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మంగళవారం విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆ భూముల్లో ఎలాంటి పనులూ జరగకుండా చూడాలని, చుట్టూ కంచె నిర్మించి కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం

వి.శ్రీనివాసరావు, లోకనాథంలతో కూడిన సిపిఎం బృందానికి హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ రాజయ్యపేటలో సాగులోవున్న మత్స్యకారులు, పేదలకు పట్టాలివ్వాలన్నారు. వేట నిషేధ కాల పరిహారం రూ.20 వేలను మత్స్యకారులకు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, ఎం.రాజేష్, డిడి.వరలక్ష్మి, నక్కపల్లి మండల నాయకులు మహేష్, యాదగిరి, బత్తిన నాగేశ్వరరావు, ప్రసాద్, రాము, రాజయ్యపేట సభలో జెడ్‌పిటిసి కాసులమ్మ, జనసేన నాయకులు పిక్కి స్వామి తదితరులు పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి..)

అధికారం ప్రభుత్వానికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. రైతుల భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని అన్నారు. భూములిచ్చిన స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. డి పట్టా, సాగు భూముల్లోని చెట్లకు పరిహారం చెల్లించకుండా నిరంకుశంగా ప్రజలపట్ల వ్యవహరించడం సరికాదన్నారు. తీర ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్క్ మరణ శాసనంలా తయారైందని తెలిపారు. గ్రామసభ, ప్రజల ఆమోదం లేకుండా పార్కు పెట్టకూడదన్నారు. గ్రామాలకు తాగునీరు ఇవ్వలేనివారు, ప్రజలను అభివృద్ధి చేస్తామనడం మోసగించడమేనని అన్నారు. కాలుష్య బాధిత రాజయ్యపేట గ్రామ కుటుంబాలకు ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయమైన హక్కులు, పర్యావరణ పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలన్నారు.

పాటిమీదలో ఉపాధి హామీ కూలీ సమస్యలను తెలుసుకుంటున్న వి.శ్రీనివాసరావు

చీకటి తెరలను చీల్చే దీపం విద్య

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విద్య చీకటి తెరలను చీల్చే దీపమని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు అన్నారు. విప్పర్తి రామం - కామేశ్వరి ఆత్మీయ సేవా ఫౌండేషన్, విశ్వ చిత్రకళ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన జర్నలిస్టుల పిల్లల పరీక్షా పరికరాల ఉచిత పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్య ఊహించని విజ్ఞానాన్ని, సాధన మంచి ఫలితాలనిచ్చే నైపుణ్యాన్ని అందిస్తుందన్నారు. ఆందోళన చెందకుండా ఆలోచనతో రాసే పరీక్షలు చక్కని ఫలితాలను ఇస్తాయన్నారు. కళావేదిక గౌరవ అధ్యక్షులు కమల్ బైడ్ మాట్లాడుతూ సృజనాత్మక ధోరణి, ధైర్యం చదువుతోనే సాధ్యం అన్నారు. ఇంచార్జి డిటిసి ఆర్‌సిహెచ్ శ్రీనివాస రావు, ఆర్‌టిఒ ఎం.బుచ్చి రాజు, జాతీయ జర్నలిస్ట్ సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షులు కమల్ బెయిడ్, విప్పర్తి రామం కామేశ్వరి ఆత్మీయ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు వి.శ్రీనివాస జగన్మోహన్, ఇంటర్నేషనల్ కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజ్ పట్నాయక్ మాట్లాడారు.

ఈ సందర్భంగా ఇటీవల అరుదైన లివర్ శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించిన విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబును సత్కరించారు. అనంతరం 75 మంది బాలలకు పరీక్షా పరికరాలు అందించారు. కొణతాల శ్రీనివాస్, ఈశ్వర్, ప్రకాష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు చెల్లించాలని విశాఖపట్నం హార్బర్ పోర్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) గౌరవాధ్యక్షులు జెవి.సత్యనారాయమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎఐటియుసి ఆధ్వర్యాన జరిగిన ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ, సెలవులు వంటి అన్ని సౌకర్యాలనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు లేబర్, ఆటో డ్రైవర్లు, ముఠా కార్మికులు, మెడికల్ ఎంప్లాయీస్, చిల్లర వర్తకులు, భవన నిర్మాణ కార్మికులు, ఆర్టీసీ పోటర్స్, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్, సివిల్ సప్లై హమాలీలు పాల్గొన్నారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం. మన్మథరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం సాగింది.

PASSPORT MISSING

విజయనగరం జిల్లా, ఎస్‌కెఎస్ఆర్ పురం గ్రామం, కొండగంగుపూడి పోస్టు, వేపాడ మండలంకు చెందిన పిన్ - 535145. చల్లా వెంకట అప్పల సత్యనారాయణ S/o (L) సింహాద్రప్పుడుకు చెందిన Passport No. T2648232 కంటోన్మెంట్ ప్రాంతం నుంచి అనకాపల్లి RTC Complex ప్రాంతమునకు వెళ్లుచుండగా అనకాపల్లిలో పోయినది. ఎవరికైనా దొరికిన యడల ఈ క్రింది ఫోన్ నెంబరుకు సంప్రదించవలసినదిగా కోరుచున్నాను. సెల్ 9959032403

IN THE HONORABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.P.41/2024

Between:
Smt. Komaravolu Suneetha . . .Petitioner
And:
Smt. Thottada Chandrakala & 13 others . . . Respondents

The 13th Respondent:
Smt. Dasari Pavani,
W/o. Not known to the Petitioner, Hindu, Aged about 35 years,
(Aadhar No. & e-mail ID is not available with the Petitioner, Mobile No. 8125111437), Resident of Flat No. 403, Revathi Towers, Backside of Subbalakshmi Kalyanamandapam, Railway New Colony, Visakhapatnam-550016.

SUMMON

The above named Petitioner filed I.P.41/2024 against the Respondents before the Honourable II Additional Senior Civil Judge at Visakhapatnam to Declare the Petitioner as insolvent, to discharge her from debts, for grant such other relief or relief's as the Honorable Court might deem fit and proper in the circumstances of the case and the same is posted to **19.03.2025.** You are hereby requested to appear before the Honourable II Additional Senior Civil Judge at Visakhapatnam on **19-03-2025 at 10:30 A.M.** either in person or through your counsel. In default of your appearance on the afore said day next step will be taken by the Honourable court in your absence.

T. JEEVAN, B.A.L.L.B.,
Advocate, #53-2-22, G.F-1
Sri Raja Rajeswari Residency, Beside RTC. Bus Complex, Raja Veedhi, Maddilapalem, Visakhapatnam-530 013.
Ph: 92466 32904, 96664 66946
Visakhapatnam.
Dt. 11-03-2025

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
O.S.1/2025

Between:
Karri Potha Reddy ...Plaintiff
And:
Ketha Naveen Kumar Reddy ...Defendant

SUMMONS

To, **The Defendant:**
Ketha Naveen Kumar Reddy,
S/o Padmanabha Reddy,
aged about 35 years,
R/at D.No.6-1-1/2,G-3,
Police Quarters, Opposite Maszid,
Chinna Waltair,
Visakhapatnam-530017.

Please take notice that the above named plaintiff has instituted the above numbered suit against you for recovery of amounts along with subsequent interest and costs and for other reliefs against promissory note executed by you in favour of plaintiff and the suit stands posted to **28-03-2025** for your appearance either in person or through a Pleader on the above said date at **10:30 A.M.** to answer all material questions failing which the suit will be heard and determined in your absence and the Hon'ble Court will further pass the necessary orders.

(By Order of the Hon'ble Court)
KVV LAW FIRM
(K.V. VISWANATH & Co.)
Advocates
Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
I.A.7/2025 in O.S.1/2025

Between:
Karri Potha Reddy ...Petitioner/Plaintiff
And:
Ketha Naveen Kumar Reddy ...Respondent/Defendant

NOTICE

To, **The Respondent:**
Ketha Naveen Kumar Reddy,
S/o. Padmanabha Reddy,
aged about 35 years,
R/at D.No.6-1-1/2,G-3,
Police Quarters, Opposite Maszid,
Chinna Waltair,
Visakhapatnam-530017.

Please take notice that the above named petitioner/plaintiff has filed an application I.A.7/2025 in O.S.1/2025 for attachment of the petition schedule property under Order 38 rule 5 CPC and the I.A stands posted to **28-03-2025** for your appearance either in person or through a pleader on the above said date at **10:30 A.M.** to answer all material questions failing which the matter will be heard and determined in your absence and the Hon'ble Court will further pass the necessary orders.

(By Order of the Hon'ble Court)
KVV LAW FIRM
(K.V. VISWANATH & Co.)
Advocates
Visakhapatnam.

గంధవరంలో దాహం కేకలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని గంధవరం గ్రామపంచాయతీలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. రెండు నెలలుగా గ్రామంలోని ఎగువ ఎస్‌సి రెల్లి కాలనీలో ఎంపిటిసి మాజీ సభ్యులు కసింకోట ముత్యాలు ఇంటి వద్ద, పట్రివారి కల్లాల్లో చెరుకూరి కిరాణా షాపు వద్ద, మంచివాడు వీధిలో వెంకన్న రాజు ఇంటి వద్ద ఉన్న బోర్లు పూర్తిగా పాడైపోయాయి. నీరు రాకపోవడంతో సుమారు 100 కుటుంబాలు తాగునీటికి దూరమయ్యాయి. అసలే మెట్ట ప్రాంతం కావడం, గ్రామంలో అధిక జనాభా ఉండటంతో నీటి సమస్య వెంటాడుతుందని స్థానికులు చెబుతున్నారు. నాలుగు బోర్ల నుంచీ నీరు రాకపోవడంతో ఆ ప్రాంతాల్లో ఉన్న కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వేసవి ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే వేసవిలో ఎలా ఉంటుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో ఏటా పైడితల్లి అమ్మవారి పండుగ నిర్వహిస్తారు. ఏప్రిల్ మొదటి వారంలో ఈ పండగను చేయడానికి గ్రామ పెద్దలు సన్నాహాలు చేస్తున్నారు. పండగ సమయంలో నీరు లేకపోతే ఇబ్బందులు తప్పవని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. నీటి సమస్య పరిష్కారం చేయాలని కోరుతున్నారు.

పాడైన బోరు

రక్షిత మంచి నీటి పథకం కొందరికే...

గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఉన్నప్పటికీ 50 శాతం మందికి ఉపయోగపడటంలేదని స్థానికులు చెబుతున్నారు. గ్రామానికి దిగువన ఉన్న సచివాలయం వద్ద నీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. ఈ ట్యాంకు ద్వారా గ్రామానికి తూర్పు వైపు ఉన్న కొన్ని కుటుంబాలకు మాత్రమే ఈ నీరు అందుబాటులో ఉందని, పడమర వైపు ఉన్న కుటుంబాలకు అందని ద్రాక్షగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ ట్యాంక్ ద్వారా మట్టి నీరే ఎక్కువసార్లు వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -గోపాలపట్నం : యువతి తన ప్రేమను అంగీకరించలేదని మనస్తాపంతో యువకుడు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధి కొత్తపాలెం ఆదర్శనగర్‌లో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి గోపాలపట్నం పోలీసుల కథనం ప్రకారం... ఆదర్శనగర్‌లో కొట్యాడ శ్రీనివాసరావు కుటుంబం నివసిస్తోంది. శ్రీనివాసరావు కార్పెంటర్ పనిచేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శ్రీనివాసరావు కుమారుడు కొట్యాడ లోకేష్ (19) ఐటిఐ పూర్తి చేసి ఏసీ మెకానిక్ వద్ద పనిచేస్తున్నాడు. రెండు రోజులుగా పనికి వెళ్లకుండా ఇంట్లోనే మౌనంగా బాధపడుతూ ఉంటున్నాడు. గత కొన్నేళ్లుగా లోకేష్ ఒక యువతిని ప్రేమిస్తున్నాడు. ఇటీవల ఆ అమ్మాయి తన ప్రేమను అంగీకరించలేదని మనస్థాపానికి గురయ్యాడు. సోమవారం రాత్రి యథావిధిగా భోజనం చేసి ఇంటిపై అంతస్తులో పడుకునేందుకు వెళ్లాడు. మంగళవారం ఉదయం ఎంతకీ బయటకు రాకపోవడంతో 11 గంటల సమయంలో తల్లి రామలక్ష్మి పైకి వెళ్లి చూసింది. తలుపులు మూసి ఉండడంతో గదికి మరోవైపున ఉన్న కిటికి తలుపులు తెరిచి చూసింది. గదిలో ఫ్యాను హుక్కుకు చీరతో ఉరి వేసుకుని కనిపించాడు. కుమారుడ్ని ఆ స్థితిలో చూసి బోరున విలపిస్తూ కేకలు వేసింది. చుట్టు పక్కల వారి సహాయంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లారు. అప్పటికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చిన వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ గొలగాని అప్పారావు నేతృత్వంలో ఎస్ఐ రామారావు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి -గాజువాక : స్థానిక న్యూ పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా పిడిఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్న ముగ్గురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు హార్బర్ ఎసిపి కాళిదాసు తెలిపారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పాత అయ్యన్నపాలేనికి చెందిన జి.ప్రసాద్ నుంచి గత నెల 14వ తేదీన 161 కేజీల బియ్యాన్ని, అదే రోజు కోరాడ గ్రామానికి చెందిన పిఇ.కొండలరావు నుంచి 263 కేజీల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. గొడ్డువానిపాలేనికి చెందిన అంకాల నారాయణరావు దగ్గర ఫిబ్రవరి 17వ తేదీన 1600 కేజీల బియ్యం, ఈనెల 10వ తేదీన 3500 కేజీల బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. మొత్తం 5,524 కేజీల బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సిఐ కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-మధురవాడ : సిఐటియు, ఐద్వా మధురవాడ జోన్ కమిటీల ఆధ్వర్యాన శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 14 మందికి ఆపరేషన్ అవసరం అని వైద్యులు నిర్ధారించారు. వారిని సిఐటియు నాయుకులు శంకర్ పౌండేషన్‌కు ఆపరేషన్ నిమిత్తం తరలించారు. వారికి బుధవారం ఆపరేషన్ చేయనున్నట్లు సిఐటియు నాయకులు రాజ్‌కుమార్ తెలిపారు.

భీమిలి సిఐ బదిలీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ సిఐ బి.సుధాకర్‌ను విశాఖ రేంజ్‌కు సరెండర్ చేస్తూ విశాఖ నగర పోలీస్ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇతని స్థానంలో విశాఖ రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ బి.తిరుమలరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'హయగ్రీవ' స్వాధీనంపై హర్షం

ప్రజాశక్తి -మధురవాడ : హయగ్రీవ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవటంపై టిడిపి విశాఖ జిల్లా పార్లమెంట్ కార్యదర్శి బోడేపూడి దొరబాబు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం రెవెన్యూ అధికారులు వచ్చి హయగ్రీవ భూముల్లో బోర్డులను ఏర్పాటుచేయడంతో వారు ఆనందం వ్యక్తంచేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం సబ్ స్టేషన్ మరమ్మత్తులు దృష్ట్యా బుధవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎఇ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పొడుగుపాలెం, చందక, గొట్టిపల్లి, వెంకటాపురం, కుసులువాడ, గిడిజాల, బాకూరుపాలెం, మిందివానిపాలెం, గుమ్మడివానిపాలెం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, గృహ, వ్యవసాయ, పారిశ్రామిక వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కెజిబివిని సందర్శించిన ఎపిసి

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం కెజిబివి పాఠశాలను మంగళవారం ఎపిసి జె.చంద్రశేఖర్ సందర్శించారు. ఇంటర్ విద్యార్థులకు ఫిజిక్స్ క్లాస్ చెప్పారు. పరీక్ష రాయడానికి సులభమైన రీతిలో అంశాలను వివరించారు. ఆరోగ్య సిబ్బందితో మాట్లాడి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి, పరీక్షలకు సిద్ధమవుతున్న తరుణంలో వారికి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ కె.గ్రేస్‌లిల్లీ, సిబ్బంది పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి- తగరపువలస : విలువలతో కూడిన విద్య అవసరమని భీమిలి ప్రభుత్వ డైట్ అధ్యాపకులు సారిపల్లి త్రినాధరావు ఉపాధ్యాయులకు సూచించారు. జివిఎంసి ఒకటో వార్డు పరిధి బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నైతిక విద్య, పని అనుభవం, ఆరోగ్య విద్య, ప్రత్యేకమైన సమయంలో కథలు చెప్పడం, ఆటలు ఆడించడం తదితర అంశాల్లో విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డిపల్లి అప్పలరాజు, ఎన్.రమేష్, డైట్ విద్యార్థులు పాల్గొన్నారు.

బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో డైట్ అధ్యాపకులు త్రినాథరావు

350 మందికి వైద్య పరీక్షలు

విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ శోభారాణి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ దివీస్ ఆధ్వర్యాన చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సంబంధిత పాఠశాల విద్యార్థులతో పాటు సిటీనగర్, పాత మూలకుద్దు, కొసనవానిపాలెం ప్రాథమిక పాఠశాలలకు చెందిన 350 మందికి వైద్య పరీక్షలు చేశారు. భీమిలి మండలం తాళ్లవలస పిహెచ్‌సి వైద్యులు శోభారాణి వైద్య పరీక్షలతో పాటు వైద్య పరంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. చిన్న పిల్లల్లో కాలానుగుణంగా వస్తున్న అనారోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చిప్పాడ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రత్నం, ప్రభాకరరావు, సిఎస్ఆర్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, నరసింహ, శేఖర్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అనంతపద్మనాభస్వామి తెప్పోత్సవం

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలో అనంతపద్మనాభ స్వామి తెప్పోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నారు. తెప్పోత్సవ కార్యక్రమాలకు ఆలయ ఇఒ నానాజీబాబు, ఎంపిపి రాంబాబు ఏర్పాట్లు చేస్తున్నారు. తెప్పోత్సవం నిర్వహించే కన్నయ్య కోనేరులో చుక్క నీరు లేకపోవడంతో వారం రోజులుగా నీటిని నింపుతున్నారు. కోనేటినిండా నీటిని నింపడం పెద్ద జల యజ్ఞమే అవుతుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇఒ, ఎంపిపి కోరారు.

తెప్పోత్సవానికి నీటిని నింపుతున్న కన్నయ్య కోనేరు

ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అధ్యక్షతన డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయంలో అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై ఢిల్లీ పిఆర్‌సి (పాపులేషన్ రీసెర్చ్ సెంటర్) నుండి వచ్చిన కేంద్ర బృందం సమీక్ష నిర్వహించింది. కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ రమణ, డాక్టర్ పాదాలు కార్యాలయ సిబ్బంది ప్రోగ్రాం అధికారుల పని తీరుపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఆర్‌బిఎస్‌కె, ఆర్‌కెఎస్‌కె, టిబి కేసులను సమీక్షించారు. శనివారం వరకు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి సమీక్షిస్తారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ, క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఇనాం భూ సమస్యతో రైతులకు ఇక్కట్లు

ప్రజాశక్తి-మధురవాడ : భీమిలి నియోజవర్గంలోని ఇనాం భూములపై రైతులకు యాజమాన్య హక్కులు కల్పించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ, అనేక ఏళ్లుగా ఈ భూములు రైతులు అనుభవంలో ఉన్నప్పటికీ పిల్లల పెళ్లిళ్ల, చదువులకు ఉపయోగపడడం లేదన్నారు. ప్రభుత్వ జోక్యం చేసుకుని ఇనాం సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారాన్ని చూపిస్తే రైతులకు యాజమాన్య హక్కులు లభిస్తాయని తెలిపారు. దీని కోసం ఇప్పటికే రెవిన్యూ మంత్రితో చర్చించానని, అత్యవసర సమావేశాన్ని ఏర్పాటుచేసి ఇనాం భూ సమస్యను పూర్తిగా పరిష్కరించాలని కోరారు.

వైసిపి పదవులకు దరఖాస్తులు

ప్రజాశక్తి -గాజువాక : తమకు పదవులు కేటాయించాలని కోరుతూ జివిఎంసి 87 వార్డు వైసిపి నాయకులు మంగళవారం మిందిలో వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్‌ను కలిసి దరఖాస్తుల అందజేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నామని, ప్రతి కార్యకర్తనూ గుర్తించుకొని పదవులు ఇవ్వాలని కోరారు. వైసిపి బలోపేతానికి తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అమర్‌నాథ్‌ను కలిసిన వారిలో 87వ వార్డు వైసిపి నాయకులు దుగ్గపు దానప్పలు, బోండా గోవిందరాజులు, ముద్దపు మురళీమోహన్, మల్ల సూరిబాబు ఉన్నారు.

అమర్‌నాథ్‌కు వినతి ఇస్తున్న దానప్పలు

కెవి, వివిలో అడ్మిషన్లు ప్రారంభించాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లోని కేంద్రీయ విద్యాలయంలోనూ, విశాఖ విమల విద్యాలయంలో అడ్మిషన్లను వెంటనే ప్రారంభించాలని కోరుతూ స్టీల్‌ప్లాంట్ సిజిఎం జి.గాంధీకి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు వినతిపత్రం అందజేశారు. ఉక్కునగరంలోని మిగిలిన విద్యా సంస్థలన్నీ అడ్మిషన్లు ప్రారంభించాయని, ఈ రెండు విద్యాలయాలు అడ్మిషన్లు ప్రారంభించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. కేంద్రీయ విద్యాలయాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు కూడా ప్రారంభించారని తెలిపారు. కేంద్రీయ విద్యాలయం, విశాఖ విమల విద్యాలయం నిర్వహణకుకు అవసరమైన ఖర్చులను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సమకూరుస్తుందని, ఖర్చులు తగ్గించుకోవాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒత్తిడి చేయడంతో గత సంవత్సరం అడ్మిషన్లు నిలుపుదలచేశారని తెలిపారు. తల్లిదండ్రుల ఆందోళనతో వెనక్కి తగ్గారని వివరించారు. ఈ రెండు విద్యాసంస్థలకు అవసరమైన నిధుల బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. గత ఆరు నెలల నుంచి ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించటానికి యాజమాన్యం నిరాకరించడం దారుణం అన్నారు. వెంటనే అడ్మిషన్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సిజిఎంకు వినతి అందిస్తున్న గంగారావు

ప్యాకేజీకి షరతులు దారుణం

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీకి పలు షరతులు పెట్టడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 1489వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు, కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు డిసిహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రూ.11440 కోట్లను ప్రకటించి అందులో రూ.8,423 కోట్లను బ్యాంకు రుణాలుగా చెల్లించారని, మిగిలిన రూ.3017 కోట్లను నాలుగు వాయిదాలుగా చెల్లిస్తామని, అవి చెల్లించాలన్నా బ్లాస్ట్ ఫర్నేస్-3ని ప్రారంభించి 92.5 శాతం ఉత్పత్తి చేయాలని షరతు పెట్టడం అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ, ఉద్యోగులను తొలగిస్తూ నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తున్న కేంద్రానికి, యాజమాన్యానికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు యు.వెంకటేశ్వర్లు, కె.జగ్గారావు, రమణమూర్తి, పట్టా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన కూరగాయలు విక్రయించాలి

ప్రజాశక్తి -కరాస : రైతు బజారుకు వచ్చే వినియోగదారులకు నాణ్యమైన కాయగూరలను రైతులు విక్రయించాలని మర్రిపాలెం రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ నారాయణరావు సూచించారు. వేసవి కాలంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నారాయణరావు మంగళవారం అవగాహన కల్పించారు. వేసవి కాలంలో పంట దిగుబడి ఆశాజనకంగా ఉండని కారణంగా ఎక్కువ మొత్తంలో కూరగాయలు తీసుకొచ్చే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతు బజార్‌కు తెచ్చిన కూరగాయలను మారు వర్తకులకు, హోటళ్ల యజమానులకు, వ్యాపారస్తులకు అధిక మొత్తంలో ఉదయం 10 గంటలలోపు విక్రయించరాదని హెచ్చరించారు. వినియోగదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. పట్టికలో సూచించిన ధర కంటే అధికంగా అమ్మకాలు సాగిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో రైతు బజార్ సహాయకులు ప్రతాప్, రైతు కమిటీ సభ్యులు, రైతులు సూపర్ మార్కెట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

28న గాజువాక న్యాయవాదుల సంఘం ఎన్నిక

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 28న జరగనున్నట్లు ప్రస్తుత అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకరరావు, టి.పుల్లయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం షెడ్యూల్ కాపీలను విడుదల చేశారు. ఈ నెల 17వ తేదీన నామినేషన్ దాఖలు, 19న ఉపసంహరణ ఉంటుందని పేర్కొన్నారు. 28వ తేదీన ఎన్నిక నిర్వహించి, అదే రోజు సాయంత్రం లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు.

గంగవరం పోర్టు కొత్త రైల్వేలైన్‌తో..

ప్రజల కష్టాలు తీరేనా?

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టు నిర్మిస్తున్న రెండో కొత్త రైల్వే లైన్‌తో కాలుష్యం, వాహనాల ట్రాఫిక్ నుంచి ప్రజల కష్టాలు తీరేనా? అని ప్రజలే ఆశగా ఎదురుచూస్తున్నారు. అదాని గంగవరం పోర్టు వల్ల మూడేళ్లుగా విపరీతంగా దుమ్ము, ధూళి పెరిగింది. దీనికి తోడు భారీ వాహనాల సంఖ్య కూడా పెరగడంతో స్వతంత్రనగర్ నుంచి పాత గాజువాక వరకు ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరిగింది. ఈ వాహనాలను వేరే మార్గంలో తరలించాలని గత కొంతకాలంగా గాజువాకలో ఉన్న వివిధ ప్రజా సంఘాలు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. దానిలో భాగంగా అదాని గంగవరం పోర్టు ప్రస్తుతం ఉన్న రైల్వే లైన్‌కు ఆనుకొని రెండో లైను పనులు చేపట్టింది. ఆరు నెలలుగా పనులు జరుగుతున్నాయి. 2వ లైను వల్ల గాజువాక ఆటోనగర్‌లోని కొన్ని పరిశ్రమలకు రోడ్డు పోనుండంతో నష్ట పరిహారం విషయంలో గతంలో గొడవలు జరిగాయి. ఆ సమస్యను పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. రెండో రైల్వే లైను పూర్తయితే బొగ్గు, ఇతర రవాణా సరుకులు వ్యాగన్ల ద్వారా తరలించాలని చూస్తున్నారు. అప్పుడు భారీ వాహనాలు పూర్తిగా తగ్గించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో ఏ మేరకు వాహనాల సంఖ్య తగ్గుతుందనేది వేచి చూడాల్సి ఉంది. పోర్టు నుంచి వడ్లపూడి, విశ్వేశ్వరాయనగర్, గాజువాక ఆటోనగర్ మీదుగా దువ్వాడ రైల్వే స్టేషన్‌కు కనెక్టివ్ చేశారు. ఈ విధంగా సరుకు రవాణా చేస్తామని పోర్టు అధికారులు తెలిపారు.

ప్రస్తుతం అదాని గంగవరం పోర్టు వల్ల గాజువాక నియోజకవర్గంలో చాలా గ్రామాలు కాలుష్యం భారిన పడ్డాయి. భారీ వాహనాల వల్ల సుందరయ్య కాలనీలోనే ముగ్గురు వ్యక్తులు అంగవైకల్యానికి గురై ఇంటికే పరిమితమయ్యారు. రాత్రి సమయంలో భారీ వాహనాలు ఢీకొనడంతో ఏ వాహనం ఢీకొందో తెలియక రోడ్డు ప్రమాదం అని గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసిన సందర్భాలు ఉన్నాయి. అదాని గంగవరం పోర్టు యాజమాన్యానికి భయపడి ట్రాఫిక్ అధికారులు కేసులు నమోదుచేయడంలేదనే విమర్శలూ ఉన్నాయి. శ్రీనగర్ లాంటి ప్రాంతాల్లో రోడ్డుకు ఆనుకుని ఉన్న సొంత ఇళ్లను వదులుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం కొత్తగా నిర్మిస్తున్న రెండో రైల్వే లైన్ పనులు

నెహ్రూనగర్‌లో సిపిఎం ప్రజాచైతన్యయాత్ర

ప్రజాశక్తి-ములగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధి నెహ్రూనగర్‌లో సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. సిపిఎం కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఇళ్ల పట్టాలు, పక్కా గృహాలు కట్టుకోలేని వారికి స్కీములు కావాలని, ఇంటి పన్నుల పేర్లు మార్పు చేయాలని, పెంచిన కరెంటు చార్జీల భారాలు తగ్గించాలని, నెహ్రూనగర్ గెడ్డ పక్కన ఉన్న ఇళ్లకు రిటర్నింగ్‌వాల్ కట్టాలని స్థానికులు సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో అందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని వాగ్దానాలు చేయడమే తప్ప ఏ ప్రభుత్వం వచ్చినా పేదలకు తప్ప ఇల్లు, స్థలం ఇవ్వడంలేదన్నారు. గత ప్రభుత్వంలో ఇంటి కోసం రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు కట్టించుకున్నారని, అయినా వారికి ఇల్లు లేదు, డబ్బులు లేవని తెలిపారు. సర్వేలో వచ్చిన సమస్యలను దరఖాస్తుల ద్వారా సచివాలయం, తహశీల్దార్, మున్సిపల్ అధికారులకు తెలియజేసేందుకు సిపిఎం నిర్వహించే ధర్నా కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జె.రామనాయుడు, డి.రాజేష్, యు.రాజు, ఎం.శ్రీనివాసరావు, బి.రాంబాబు, కె.రమణ, జి.రామకృష్ణ, ఎ.ప్రశాంత్, దుర్గారావు, సిహెచ్.పైడినాయుడు, జె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలనడిగి తెలుసుకుంటున్న ఆర్.లక్ష్మణమూర్తి తదితరులు

14 నుంచి నాటకోత్సవాలు

ప్రజాశక్తి -మాధవధార : కీర్తిశేషులు సనపల సూర్యనారాయణ, అన్నపూర్ణ స్మారక నాటకోత్సవాలు ఈ నెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విశాఖపట్నం పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కెవి మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్, మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ సంయుక్త నిర్వహణలో ఈ నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో రోజూ సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇంద్ర ప్రస్థానం, మా ఇంట్లో మహాభారతం, జనరల్ బోగీలు, పక్కింటి మొగుడు, సంకల్పం, భక్త ప్రహ్లాద నాటికలను ప్రదర్శించనున్నట్లు వివరించారు. కళాకారులు, కళాభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 86, 87 వార్డుల్లో ఈ నెల 12న నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని వాటర్ సప్లై ఎఇ కేదారినాథ్ తెలిపారు. జోన్- 6 గాజువాక పరిధి సిద్ధార్థ నగర్‌లోని 12 ఎంఎల్‌డి మంచినీటి శుద్ధి కర్మాగారం నందు వాల్వులు మార్పుట, ఇతర చిన్నచిన్న మరమ్మత్తుల నిమిత్తం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. తాగునీటికి కలుగు అసౌకర్యాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

షోకాజు నోటీసును ఉపసంహరించుకోవాలి

విభాగాధిపతికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కు కార్మిక నేత అయోధ్యరామ్‌కు స్టీల్ యాజమాన్యం ఇచ్చిన షోకాజ్ నోటీసును తక్షణం ఉపసంహరించుకోవాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపు తక్షణం ఆపాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్‌లో వివిధ విభాగాల ఎదుట ధర్నా నిర్వహించి విభాగాధిపతులకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్.రావు, కో-కన్వీనర్ రమణమూర్తి, జె.అయోధ్యరామ్, పి.శ్రీనివాసరాజు, వైటి.దాస్, యు.రామస్వామి మాట్లాడుతూ, యాజమాన్యం సుమారు ఆరు నెలలుగా సకాలంలో జీతాలు చెల్లించకుండా స్టీల్ కార్మికులను అనేక ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. సుమారు 6000 మంది కార్మికులకు హెచ్‌ఆర్ఎ నిలుపుదల చేయడం, ఉక్కు నగరంలో నివసిస్తున్న కార్మికులకు కరెంటు చార్జీలు యూనిట్‌కు ఎనిమిది రూపాయల చొప్పున పెంచడం, కార్మిక హక్కులపై నిరంకుశ వైఖరిని ప్రదర్శించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఒకపక్క ప్రభుత్వం పూర్తిస్థాయి ఉత్పత్తి చేయాలని చెబుతూనే 1130 మందిని విఆర్ఎస్ పేరుతో ఇంటికి పంపుతోందని తెలిపారు. ఇదే సమయంలో సుమారు 6000 మంది కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తొలగించే విధంగా చర్యలు చేపట్టారని చెప్పారు. వీటి గురించి అడిగిన కార్మిక నేతలకు నిరంకుశంగా షోకాజ్ నోటీసులను ఇచ్చి కట్టడి చేయాలని భ్రమించడం అవివేకమని ఎద్దేవా చేశారు. ఇప్పటికే కాంట్రాక్టు కార్మికుల భవిష్యత్తును అంధకారం చేసిన యాజమాన్య వైఖరికి నిరసనగా సమ్మె నోటీసు ఇచ్చారని గుర్తు చేశారు. రీజనల్ లేబర్ కమిషనర్ సమక్షంలో నేడు జరుగుతున్న చర్చలు విఫలమైతే వారు చేసే పోరాటానికి పూర్తి మద్దతు అందిస్తామని, ఐక్య ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టీల్ అఖిల పక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు జె.రామకృష్ణ, సుబ్బయ్య, టివికె.రాజు, నీలకంఠం, పుల్లారావు, మరిడయ్య, వి.ప్రసాద్, విడివి.పూర్ణచంద్రరావు, నాగబాబు, దాసరి రవి, మహాలక్ష్మినాయుడు, రామ్‌కుమార్ తదితరులతో పాటు వివిధ విభాగాల అధ్యక్షకార్యదర్శులు, కాంట్రాక్టు కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-పరవాడ

వికలాంగ బాల బాలికలకు ఎన్‌టిపిసి అందజేసిన ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. జిల్లాలోని భవిత కేంద్రాల వికలాంగ బాలబాలికలకు రూ.12.99 లక్షలతో ఉపకారణాలను ఎన్‌టిపిసి సింహాద్రి సమకూర్చింది. ఈ మేరకు స్థానిక సంయుక్త ఫంక్షన్ హాల్లో పరవాడ ఎన్‌టిపిసి, సమగ్ర శిక్ష సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన ఉపకరణాల వితరణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వికలాంగ బాలబాలికలకు తల్లిదండ్రులు, రిసోర్స్ ఉపాధ్యాయుల సహాయ, సహకారాలతో బాటు ముఖ్యమైన కనీస ఉపకరణాలు వారి అభివృద్ధికి తోడ్పడతాయని తెలిపారు. సమగ్ర శిక్ష అదనపు పథక సంచాలకులు డాక్టర్ జయప్రకాశ్ విధుల్లో చేరిన అనతి కాలంలోనే ఇటువంటి మంచి కార్యక్రమాలు అమలు చేయడంపై ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు. డాక్టర్ జయప్రకాశ్ మాట్లాడుతూ గతంలో పరవాడ ఎన్‌టిపిసి, ఉమ్మడి విశాఖ జిల్లాలో 43 భవిత కేంద్రాలకు రూ.12 లక్షలతో ఉపకారణాలు అందజేసినట్లు చెప్పారు. తాజాగా 12.99 లక్షలతో అనకాపల్లి జిల్లాలో గల 24 భవిత కేంద్రాలకు ఆరు సహిత విద్యా రిసోర్స్ రూములకు ఉపకరణాలు అందజేయడం అభినందనీయమన్నారు. పరవాడ ఎన్టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ మాట్లాడుతూ సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా పలు విద్య, వైద్య, బాలికా సాధికారత, ఉపకార వేతనాలు వంటి సామాజిక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఉపకరణాలను మండలాల వారీగా భవిత కేంద్రాలకు, వికలాంగ బాలబాలికలకు అందజేశారు. వికలాంగ బాలబాలికలచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి బి.శకుంతల, వివిధ మండలాల నుండి రిసోర్స్ ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు, ఎన్టిపిసి సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎన్‌టిపిసి అధికారులు

మినీ వ్యాపారవేత్తల రిజిస్ట్రేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-యలమంచిలి : మున్సిపాలిటీ స్వయం సహాయక సంఘాల్లో మినీ వ్యాపారవేత్తల రిజిస్ట్రేషన్ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైందని మెస్మా సిఎంఎం పద్మావతి తెలిపారు. మెస్మా కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. మహిళలకు ఇది సువర్ణ అవకాశంగా పేర్కొన్నారు. కమిషనరు ప్రసాదరాజు మాట్టాడుతూ కావలసిన రంగంలో తర్ఫీదు పొంది వ్యాపారాన్ని ప్రారంభించే అవకాశం ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ డిపార్టుమెంటు సర్టిఫికేట్లు అందజేస్తారని తెలిపారు. బ్యాంకు రుణాలకు ఈ సర్టిఫికేట్లు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో కార్యక్రమంలో శిక్షకులు అచ్యుతరావు, అమూల్య, మెస్మా సిబ్బంది, సిఓ, సిఎల్ఆర్‌పిలు పాల్గొన్నారు.

మామిడి పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మామిడి పూత, పిందెల దశలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి.ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని తవ్వవానిపాలెం, అమృతపురం గ్రామాల్లో అయన మంగళవారం పర్యటించి మామిడి తోటలను పరిశీంచారు. ఈ సందర్భంగా ఆయన మామిడి రైతులతో ముఖాముఖి మాట్లాడి పలు సూచనలు అందించారు. మామిడి కాయ నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు పండ్ల కవర్లను తొడగాలన్నారు. అధికంగా పూత, పిందె రాలుతున్నప్పుడు ప్లానోఫిక్స్ 2 మిలి/లీటర్ నీటికి కలిపి, డోసు ఎక్కువ కాకుండా, వేరే ఇతర మందులతో కలపకుండా ఉదయం/సాయంకాల సమయాల్లో పిచికారి చేయాలని సూచించారు. జీవన ఎరువులను 250 గ్రా చొప్పున పశువుల ఎరువులో కలిపి వాడుకోవడం ద్వారా మొక్కకి పోషకాల లభ్యతను పెంచవచ్చునని చెప్పారు. మామిడి కాయ పెరిగే దశలో 13:0:45 10గ్రా/లి. యూరియా 5గ్రా/లి పిచికారి చేస్తే కాయ ఎదుగుదలకు తోడ్పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి ఆర్.కిరణ్మయి, గ్రామ ఉద్యానవన సహాయకులు పి.భావన తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో వీధిలైట్లు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు దేశపాత్రునిపాలెంలో పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు సహకారంతో ఏర్పాటు చేసిన రింగు లైట్లును స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయినగర్ కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద, సాయి నగర్ వెళ్లే మెయిన్ రోడ్డులో, దేశపాత్రునిపాలెం రామాలయం వద్ద, జాజులవానిపాలెం కళ్యాణమండపం వద్ద, జాజులవానిపాలెం బోనంగి జంక్షన్ వద్ద తదితర ఐదు చోట్ల ఐదు రింగ్ లైట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. త్వరలో కొత్త వీధిలైట్లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మచ్చ శివ, కరణం అప్పారావు, జాజుల చిన్నారావు, పూడి బాబురావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

సిపిఐ జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-యలమంచిలి : భారత కమ్యూనిస్టు పార్టీ అనకాపల్లి జిల్లా రెండో మహాసభ మే 5, 6, 7 తేదీల్లో యలమంచిలిలో జరపాలని నిర్ణయించామని, దానిని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. మహాసభ కరపత్రాలు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఐ సమసమాజ స్థాపనకు కట్టుబడి ఉందన్నారు. జిల్లా మహాసభ యలమంచిలిలో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజన్న దొరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్యాసిరావు, రామునాయుడు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు తరలిరావాలి

నేటి చలో విజయవాడకు

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి పిలుపు

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న గనిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి-పరవాడ

మండలంలో ఉపాధి హామీ కూలీలకు బకాయి పడ్డ ఆరు వారాలు వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని బొద్దపు వానిపాలెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో కలిసి బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ ఆయన నినాదాలు చేశారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ ఆరు వారాలు నుండి బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు పస్తులు ఉంటున్నారని తెలిపారు. పని చేసిన కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలన్నారు. గత మూడు సంవత్సరాలుగా బడ్జెట్లో నిధులకు కోత విధించి మేటిరియల్ చార్జీలు పెంచేశారని తెలిపారు. దీంతో కాంట్రాక్టర్లుకు బిల్లులు ముందు చెల్లించి, తరువాత కూలీలకు వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. గతంలో 20 శాతం సమ్మర్ అలవెన్సులు ఇచ్చే వారని ఇప్పుడు పూర్తిగా కోత పెట్టారని పేర్కొన్నారు. మెడికల్ కిట్టులు, టెంట్, మెటీరియల్ అలవెన్స్‌లకు కోత పెట్టారని వెంటనే సమ్మర్ అలవెన్సు 30 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి 200 పనిదినాలు, రోజు కూలి రూ.600 ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.రామమోహన్‌రావు అన్నారు. మండలంలోని మల్లునాయుడుపాలెం, బోదువలస గ్రామాలలో గుల్లేపల్లి పశు వైద్యాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో జరుగుతున్న టీకాలు వేసే కార్యక్రమాన్ని మంగళవారం డాక్టర్ రామ్మోహన్‌రావు, విశాఖపట్నం డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, సబ్బవరం సహాయ సంచాలకులు డాక్టర్ ఉషాకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు ఈనెల 30వ వరకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పశు సంవర్ధక సహాయకులు ఎ.రమేష్, డి. రమేష్, రైతులు పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు యలమంచిలి పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చల్లా గంగాధర్ అన్నారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మండలంలో

పశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

7,513 పశువులు ఉండగా వాటిలో గేదెలు 6,441 ఉన్నాయని తెలిపారు. ఉన్న వాటిలో 3,540 పశువులకు టీకా వేయడం పూర్తయిందన్నారు. మండలంలో మూడు బృందాలుగా టీకా కార్యక్రమం వేయడం జరుగుతోందన్నారు. పశువులు తీవ్రమైన జ్వరం, నీరసం, నోటినుంచి తీగల మాదిరి గొంగ, కాలి గిట్టల మధ్య పుళ్లు గల పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధికి టీకా తప్పని సరని గంగాధర్ చెప్పారు.

నేటి నుండి సీతా రామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి మెయిన్ రోడ్డులో నూతనంగా నిర్మించి శ్రీసీతారామచంద్రమూర్తి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఈ నెల 12 నుండి మూడురోజులు పాటు జరగనున్నాయని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆడారి తులసీరావు అభీష్టం మేరకు ఈ ఆలయం నిర్మించడం జరిగిందన్నారు. 14న అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు.

గుర్రం పరుగు పందెంలో పాల్గొన్న దృశ్యం

ఉత్సాహంగా జిల్లాస్థాయి గుర్రపు పందేలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని తవ్వవానిపాలెం గ్రామ దేవత శ్రీపరదేశిమాంబ అమ్మవారి పండగ మహొూత్సవం సందర్భంగా జిల్లాస్థాయి గుర్రం పందేలు పోటీలు మంగళవారం ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ప్రారంభించారు. ఈ పోటీలలో విజేతలు ప్రథమ బహుమతి భార్గవ్ జెర్సీ, ద్వితీయ బహుమతి సింగపూర్ సత్యనారాయణ సత్యమ్మ తల్లి శక్తి, తృతీయ బహుమతి సురేంద్ర వారాహి, నాలుగో ప్రైజు అప్పలనాయుడు చిరుత, 5వ ప్రైజ్ సింగపూర్ సత్యనారాయణ దేవరాయ, ఆరో ప్రైజు సురేంద్ర రాకెట్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, పెందుర్తి వైఎస్ఆర్సిపి నాయకులు గండి రవికుమార్, ఎంపీటీసీ బోకం బాలకృష్ణ (బాలు), వైసిపి మండల యువజన విభాగం అధ్యక్షులు బోకం శ్రావణ్ కుమార్, బోకం కాసుబాబు, బోకం శేషగిరిరావు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు, కోటాన రాము, కర్రి బాబు, మోపాడ అప్పారావు, వడ్డాది అప్పలరాజు, ఎడ్ల నాయుడు, గొర్లి రాజేష్, గవర రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గంగాదేవి గావు పండగ

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రతి మూడేళ్లకు ఒకసారి నిర్వహించే గంగాదేవి గావు పండుగ మండలంలోని కింతాడ శివారు జోగన్నపాలెం, గుల్లేపల్లి గ్రామాల్లో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుండి రాత్రి వరకు పూజలు చేశారు. తప్పెడు గుళ్ళు ప్రదర్శన జరిగింది. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పండుగ తిలకించడానికి చుట్టుప్రక్కల గ్రామాల నుండి ప్రజలు తరలివచ్చారు. జోగన్నపాలెంలో గంగాదేవి గావు పండుగ గ్రామ సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ మాజీ సర్పంచ్ బండారు నరసింహనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు.

మధుబాబు పుట్టినరోజు సందర్భంగా పలు సేవలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా డివిఎంసి సభ్యులు రేబాక మధుబాబు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనకాపల్లి కొమ్మోజు గణేష్ ఆధ్వర్యంలో సత్యసాయి మందిరంలో అనాధలకు భోజనాలు పంపిణీ, కసింకోట విద్య వీరేంద్ర ఆధ్వర్యంలో యాచకులకు భోజనాలు పంపిణీ, సత్యసాయి మందిరంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తట్టా రాజు ఆధ్వర్యంలో అచ్యుతాపురం ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ వికలాంగుల పాఠశాలలో పదో తరగతి పిల్లలకు నోట్ బుక్కులు స్టేషనరీ, మునగపాక మండలం అంబేద్కర్ కాలనీలో బిలా శివ గణేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు నోట్ పుస్తకాలు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా ఇంచార్జ్ లోవచంద్ ఆధ్వర్యంలో కె.కోటపాడు మండలం ఏ,కోడూరులో సోషల్ వెల్ఫేర్ హాస్టల్ నందు 10వ తరగతి విద్యార్థులకు ప్లాంక్లు పెన్నులు స్టేషనరీ పంపిణీ చేశారు. సబ్బవరం మండలంలో దండు సూర్యనారాయణ ఆధ్వర్యంలో 50 మంది యాచకులకు అన్నదానం చేశారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో దాసు ఆధ్వర్యంలో పదిమంది యువకులు రక్తదానం చేశారు. పలుచోట్ల కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో ఇరుగుల సంతోష్ కుమార్, తట్టా సూరిబాబు, మద్దిల దుర్గా ప్రసాద్, ఇరుగుల స్వామి, ఇరుగుల నాయుడు, ఉష నుకప్పారావు, మామిడి సూరిబాబు, యర్రంశెట్టి గురయ్య, బొత్స అప్పారావు, జాగరపు మహేష్, కొండారావు, దెందేటి దేముడుబాబు, కణితి విజయ్, కొత్తపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్స్ అందిస్తున్న దృశ్యం

క్రీడల్లో న్యాయ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ విద్యార్థులు 65 మంది ఈ నెల 6 నుండి 10 వరకు కోల్‌కతాలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జురిడికల్ సైన్సెస్ (ఎన్‌యూజెఎస్)లో జరిగిన వార్షిక క్రీడా ఉత్సవం ఇన్విక్టా 25లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. దేశంలోని వివిధ వర్సిటీల నుండి 25 జట్లు పాల్గొన్నాయి. డిఎస్‌ఎన్‌ఎల్‌యూ విద్యార్థులు అన్ని రంగాలలో ప్రతిభ కనపరచి రన్నరప్ టైటిల్‌ను గెలుచుకున్నారు. బాస్కెట్‌బాల్ (పురుషులు), వాలీబాల్ (పురుషులు), త్రోబాల్ (మహిళలు), బ్యాడ్మింటన్, బహుళ ట్రాక్ ఈవెంట్‌లలో బంగారు పతకాలు, క్రికెట్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, అథ్లెటిక్స్‌లో రజత పతకాలు, షాట్‌పుట్, లాంగ్ జంప్, హైజంప్ ఈవెంట్‌లలో కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మంగళవారం వర్సిటీలో ఉపకులపతి ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఒ.మంగరాజు, స్పోర్ట్స్ కమిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి తీర్థం

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : మండలంలోని వాకపల్లి గ్రామంలో శ్రీఅభయాంజనేయ స్వామి వారి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక మాజీ ఎంపీటీసీ పెనగంటి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో గుర్రం పరుగు ప్రదర్శన నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం జరిగిన భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మహిళల కోలాటం అలరించింది. ఈ కార్యక్రమంలో రైవాడ ప్రాజెక్ట్ చైర్మన్ పోతల పాత్రు నాయుడు, దొగ్గ దేముడు నాయుడు, చల్లా నానాజీ, అవుగడ్డ కోటిపల్లి నాయుడు, మాజీ సర్పంచ్ బుదిరెడ్ల అప్పారావు, బండారు రామారావు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షులు కొరుప్రోలు శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష సామాగ్రిని దాత దారపురెడ్డి సన్యాసినాయుడు సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు బాలత్రిపుర సుందరి, మండల కార్యదర్శులు రంది వెంకట్రావు, గంగావంశం సంతోష్, అజయ్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

డిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని చూచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.రవికుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సిలో వ్యాక్సిన్ కోల్డ్ చైన్ నిర్వహణ, ల్యాబ్, మందుల స్టోర్, వార్డ్, ఆపరేషన్ థియేటర్లను, రికార్డులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. పీహెచ్‌సిలో ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించి డెలివరీస్ తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు సమీక్షించి వాటికి సంబంధించిన రికార్డ్స్, రిపోర్ట్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తర్ణాధికారి గుర్రం శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ ఏ సువర్ణరాజు, హెల్త్ సూపర్వైజర్ బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి షేక్ అయేషా ఆదేశించారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని తహసిల్దార్ లక్ష్మికి సూచించారు. రికార్డ్ డాన్స్ సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ షేక్ అయేషా

ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి చెల్లింపులో
కూటమి ప్రభుత్వం విఫలం

పోస్టర్ విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి చెల్లించడంలో రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి జిల్లా అధ్యక్షులు బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం రింగ్ రోడ్డు వైసిపి కార్యాలయంలో యువత పోరు కార్యక్రమం పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి సమస్యలపై మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు బుధవారం వైసిపి ఆధ్వర్యాన యువత పోరు కార్యక్రమం నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మల్ల బుల్లిబాబు, మందపాటి జానీ, కలగా గున్నయ్య నాయుడు, మలసాల కిషోర్, పెద్దిశెట్టి గోవింద, జాజుల రమేష్, కెఎం నాయుడు, వెంకటరమణ, మరిపల్లి శోభ, గైపూరి రాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బకాయి పాపం జగన్‌దే

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పీలా గోవింద

అనకాపల్లి : గత వైసిపి జన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలన వల్లే రూ.4720 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఏర్పడ్డాయని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీల గోవింద సత్యనారాయణ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ, బీసీ విద్యార్థులపై కక్షతోనే జగన్ రెడ్డి ఫీజు రీయింబర్స్మెట్ పథకాన్ని రద్దు చేసారన్నారు. ఫీజు రీయింబర్స్మెట్ బకాయిలపై వైకాపా నాయకులకు మాట్లాడే నైతిక హక్కులేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొద్దపు ప్రసాద్, తలారి కాశీ నాయుడు, బత్తుల రమేష్, యర్రా సత్యనారాయణ, వేగి కృష్ణ, గవర సురేష్, శిరసపల్లి రాజు, షేక్ రియాజ్, ఆళ్ళ జగన్, నూకరాజు, జోగి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగన్ రెడ్డి ప్రభుత్వ నిర్వాహకం వల్ల మూడు క్వార్టర్ ఫీజులు బకాయి ఉన్నాయని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కాలేజీలు ప్రభుత్వం మధ్య ఉండాల్సిన ఫీజుల అంశాన్ని కాలేజీలు తల్లిదండ్రులకు మధ్యకు తీసుకొచ్చి విద్యార్థులను ఇబ్బంది పెట్టారన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : 2024-25 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బిసి, కాపు (కాపు, బలిజ, తెలగ, ఒంటరి), ఇబిసి, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన లబ్ధిదారులకు బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకులు జి.పెంటోజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఎపి-ఒబిఎంఎంఎస్ ద్వారా వారి పేరును ఆన్‌లైన్‌లో నమోదుకు ఈ నెల 10 నుండి 22వ తేదీ వరకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. వ్యవసాయం, అనుబంధ, రవాణా, పరిశ్రమలు, సేవలు, వ్యాపార రంగాలు, స్వయం ఉపాధి, బి.ఫార్మసీ / డి.ఫార్మసీ అభ్యర్థులకు చెందిన నిరుద్యోగ బిసి ఈడబ్ల్యూఎస్ యువతకు జెనరిక్ ఫార్మసీలకు, మేదర, కుమ్మరి / సాలిహాన వృత్తి పనివారికి ఒకరు లేదా ముగ్గురు నుండి ఐదుగురు సభ్యులు గ్రూపుగా ఏర్పడిన వారికి బ్యాంకు లింకేజ్‌తో ఆర్థిక సహాయం పథకాలకు బిసి కార్పొరేషన్ ద్వారా రుణాలు అందిస్తునట్లు చెప్పారు. కాపు, ఇబిసి, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ తదితర కార్పొరేషన్ల ద్వారా రుణాలు కోసం ఆయా కుల ధ్రువీకరణ ప్రతాలతో దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరుకు పట్టణ ప్రాంతం వారి ఆదాయం రూ.1,03,000, గ్రామీణ ప్రాంతం వారి ఆదాయం రూ.81,000, లేదా అంతకంటే తక్కువగా ఉండాలని సూచించారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల వారికి 21 నుండి 50 సంవత్సరాల మధ్య వయసు, మిగిలిన వారికి 21 నుండి 60 సంవత్సరాల మధ్య వయసు ఉండాలన్నారు. తెల్లరేషన్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని, ఒక కుటుంబం తెల్ల రేషన్ కార్డు నందు ఒక్కరు మాత్రమే లబ్ది పొందుటకు అర్హులని పేర్కొన్నారు. జెనరిక్ ఫార్మసీ కొరకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థి కచ్చితంగా బి.ఫార్మసీ / డి.ఫార్మసీ పూర్తి చేసి ఉండాలని, నిరుద్యోగి సొంత మెడికల్ షాపు లేనివారై ఉండాలని స్పష్టం చేశారు. అర్హతలు ఆసక్తి ఉన్నవారు https:// apobmms.apcfss.in వెబ్‌సైట్‌లో మార్చి 10వ తేది నుండి 22 తేదీ లోగా వారి పేర్లను ఎపి-ఒబిఎంఎంఎస్ వెబ్‌సైట్ నందు నమోదు చేసుకోవలసినదిగా కోరారు.

15లోగా గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

మహాత్మ జ్యోతిబాపూలే ఎపి వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్, 5వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల కన్వీనర్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, ఐదో తరగతితో పాటు 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా సీట్లలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ బాలికలకు పరవాడ మండలం తానాం గురుకుల కళాశాలలోనూ, బాలురుకు సింహాచలంలోని గురుకుల కళాశాలలోనూ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం బీసీ గురుకుల పాఠశాలల్లో బాలురుకు, తానాం, చోడవరం, పాయకరావుపేటలో బీసీ సంక్షేమ గురుకులాల్లో బాలికలకు 5వ తరగతి, 6, 7, 8, 9 తరగతులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలో స్థానం సంపాధించిన విద్యార్థులకు అనుభవం కలిగిన అధ్యాపక బృందంతో ఉత్తమ శిక్షణ, ఉచిత విద్య, వసతి కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే విద్యా కానుక, ఉచిత యూనిఫామ్, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని, యోగ, స్పోర్ట్స్, క్రీడల్లో తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 15వ ఏది లోపల ఆన్‌లైన్‌లో website : https://mjpapbcwreis.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20న, 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27న, 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీ స్థానాల్లో ప్రవేశానికి పరీక్ష ఏప్రిల్ 28న నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

శివాలయాల నిర్మాణానికి బుచ్చిరాజు విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలో శివాలయం పునర్నిర్మాణానికి సబ్బవరం గ్రామానికి చెందిన అనకాపల్లి జిల్లా టిడిపి తెలుగు యువత అధ్యక్షుడు పిబివిఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు) దంపతులు రూ.5,11,116 విరాళాన్ని మంగళవారం ఆలయ ఉత్సవ కమిటీకి అందజేశారు. పెదనాయుడుపాలెం శివారు గణపతిపురం శ్రీ మల్లికార్జున స్వామి శివాలయం నిర్మాణానికి లక్ష రూపాయలు అందించారు. ఈ బుచ్చిరాజు దంపతులకు ఆయా శివాలయాల కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో దంగేటి ప్రకాష్, దంగేటి నాని, గెడ్డం కృష్ణ, బర్ల రమణ, కోరాడ శ్రీనివాసరావు, కిల్లి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

సీడాప్ ఆధ్వర్యాన జాబ్ మేళాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : సొసైటీ ఫర్ ఎంప్లాయ్మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ప్రైజ్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) ద్వారా మార్చి నెలలోని 14, 18, 28వ తేదీలలో జిల్లాలలో జాబ్ మేళాలు నిర్వహణకు జాబ్ కాలెండర్ విడుదల చేసినట్టు మైనారిటీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు షంసున్నీసా బేగమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీన చోడవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కళాశాలలోనూ, 18న యలమంచిలి ఎస్‌జిఎ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ, పాయకరావుపేట ప్రభుత్వ ఐటిఐలోనూ, 28న మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ ఈ జాబ్ మేళాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మైనారిటీ వర్గాలకు చెందిన అనగా, ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన్ యువత తగిన అర్హతను బట్టి https://seedap.ap.gov.in అనే వెబ్ సైటులో యూత్ రిజిస్ట్రేషన్ కాలమ్ నందు క్లిక్ చేసి, కోర్సు వివరాలు క్లిక్ చేస్తే, వివిధ రంగాలకు చెందిన శిక్షణా కార్యక్రమాల వివరాలు ఉంటాయని తెలిపారు. ఆయా ప్రదేశాలలో జరుగు శిక్షణా కార్యక్రమాలకు హాజరై ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణా కార్యక్రమాలకు సంబంధించి ఇతర వివరాలకు www.seedap.ap.gov.in వెబ్ సైటును సంప్రదించవచ్చని తెలిపారు. జాబ్ మేళాల గురించి సమాచారానికి జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి, లేదా జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఏపి స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, డాక్టర్ ధీన్ షాదిఖానా, ఓల్డ్ పోస్ట్ ఆఫీసు, విశాఖపట్నం వారిని స్వయంగాగాని లేదా మొబైలు నెంబర్ 9849901159 లేదా 0891-2502271కు కాల్ చేసి సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పలు గ్రామాల్లో పండగ మహోత్సవాలు

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలంలో వివిధ గ్రామాల్లో గ్రామదేవతల పండుగలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తానాం గ్రామంలో శ్రీపరదేశిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవంలో పాల్గొని పెందుర్తి శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల చీరలకు అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ ఆర్థిక సహాయం అందించారు. పరవాడ గ్రామ దేవత శ్రీపైడితల్లమ్మ అమ్మవారి పండుగ మహోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం గ్రామ దేవత శ్రీపోలమాంబ అమ్మవారి పండుగ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పైల జగన్నాథ రావు, సర్పంచ్ కన్నూరు దేవి రమణ, వర్రి పరదేశి నాయుడు, పైలా కృష్ణ, రొంగల అప్పారావు, పైలా మధు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని గోకువానిపాలెం గ్రామంలో శ్రీగజ్జలమ్మ తల్లి పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ఇందులో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నైనంశెట్టి రమణరావు, ఉలింగల రమేష్, నిమ్మదాల సన్యాసినాయుడు, కర్రి వెంకట సత్యనారాయణ, కలిగెట్ల సింహాద్రి, జెర్రిపోతుల నూకు నాయుడు, గొంతిని ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీడిపిక్కలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

- గిరిజన రైతుల ఆందోళన

నినాదాలు చేస్తున్న నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి- మాడుగుల:జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి, ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, పంటల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా ఐదవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకురాలు కె.భవాని డిమాండ్ చేశారు. మండలంలోని శంకరం పంచాయతీ పరిధిలో రాయిపాలెం గ్రామంలో సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజన రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జీడి పంటకు గిట్టుబాటు ధర లేక దళారీల చేతిలో దోపిడీకి గురై తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాణిజ్య పంటలకు మద్దతు ధరలు ప్రకటిస్తుంటాయని, కానీ జీడి పంటకు మాత్రం మద్దతు ధర ప్రకటించడం లేదన్నారు. జీడిపిక్కలు 80 కేజీల బస్తా వ్యాపారులు ఏడు వేలకు మించి కొనుగోలు చేయడం లేదన్నారు. జీడిపిక్కలు 80 కేజీల బస్తాకు రూ 16వేలు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. వీటన్నింటిని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, గతంలో ఇచ్చిన రాయితీలు పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిప్పాడ సోములమ్మ, సిదిరి నాగలక్ష్మి, ఇరట ముసలమ్మ, సాగరి ఈశ్వరరావు, సిదిరి కన్నారావు, పల్లిబోయిన నూకరాజు, సోలం వెంకటరమణ, చెదరాడ దేవరాజు అధిక సంఖ్యలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని సిహెచ్ బి అగ్రహారంలో పెండ్యాల చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో డి.సీతారామరాజు మంగళవారం పరిశీలించారు. పనులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అనే అంశాన్ని క్షుణంగా పరిశీలించారు. నిర్దేశించిన పనులు సకాలంలో పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. వేతనదారులకు రోజుకు 300 రూపాయలు తగ్గకుండా వేతనం వచ్చే విధంగా పని కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ భాగ్యలత పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి:తడి పొడి చెత్త సేకరణ పై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీవో డి సీతారామరాజు అన్నారు. మండలంలోని కాగిత లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. సంపద కేంద్రం ద్వారా సంపద సృష్టించుకుని పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. గ్రామాల పరిశుభ్రతే లక్ష్యంగా పనిచేయాలన్నారు. వాటర్ ట్యాంకును పరిశీలించి, ట్యాంక్‌ను ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేయాలన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న తహాశీల్దార్

ప్రజాశక్తి -కోటవురట్ల: గృహ నిర్మాణదారులకు అందజేసే ఎల్ పి సి లతోపాటు పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తహసిల్దార్ తిరుమల బాబు సూచించారు. మంగళవారం సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మ్యూటిషన్ సమస్యలతో పాటు గ్రీవెన్స్ సమస్యలు, రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. చిన్న బొడ్డేపల్లి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరహానది సమీప పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లో రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అక్రమంగా తరలిస్తున్న ఇసుక పట్ల చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి టి రమేష్ , సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న ఛైర్మన్

తాండవ గేట్ల మరమ్మతు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- నాతవరం: మండలంలో తాండవ ఆనకట్ట గేట్లను 11.40 లక్షల రూపాయల వ్యయంతో మరమ్మతు పనులను ప్రాజెక్ట్ ఛైర్మన్ కరక సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ నందిపల్లి వెంకటరమణ, డి.ఇ. అనురాధ, జె.ఇ.శ్యామ్, మాజీ ఎంపీటీసీలు కాశపు నూకరాజు (బొబ్బిలి), శివలంక మరడీశ్వర్రావు, అప్పన విజయ్, బొడ్డు ప్రవీణ్ కుమార్, కూనిశెట్టి దివానం, ఉల్లి రమణ, కశింకోట గోవిందరావు పాల్గొన్నారు.

మరమ్మతు చేపడుతున్న సిబ్బంది

తాగునీటి మోటార్‌కు మరమ్మతు

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలోని శంకరం పంచాయతీ గొప్పూరు, తాడివలస గ్రామాల్లో తాగునీటి సమస్యపై గిరిజనలు, సీపీఎం నాయకులు సోమవారం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టిన వార్త ప్రజాశక్తిలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. మోటార్ మరమ్మతు పనులు మంగళవారం ప్రారంభించారు. ఎంపీడీవో, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతూ, శంకరం గ్రామంలో సుమారుగా 16 శివారు గ్రామాలు ఉన్నాయని గొప్పూరు, తాడివలస, శంకరం పంచాయతీకి సుమారుగా 5 కిలోమీటర్లు దూరంలో ఉందన్నారు. తాగు నీరు నిమిత్తం 20 వేల లీటర్లు సామర్థంతో రక్షిత మంచినీటి పథకం కలదన్నారు. ఇటీవల మోటారు బోరు తరచూ మోరాయిచడంతో స్పేర్ మోటారును వేయడం జరిగిందన్నారు. బుధవారం నుంచి తాగు నీరు యథా తథంగా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవాలు

కల్యాణాన్ని నిర్వహిస్తున్న పురోహితులు

ప్రజాశక్తి- నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో కోదండరాయుడు కల్యాణం రమణీయంగా జరిగింది. వెంకన్న వార్షిక తిరు కళ్యాణోత్సవాల్లో భాగంగా ఆలయ కల్యాణవేదిక వద్ద శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, వేద పండితులతో కూడిన అర్చక బృందం అంగరంగ వైభవంగా జరిపించారు. సోమవారం అర్ధరాత్రి తర్వాత ప్రారంభమైన వేడుక మంగళవారం తెల్లవారుజాము వరకు జరిగింది. కల్యాణం తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. ఉపమాక సింహాద్రాచార్యులు ఇంటి వద్ద ఎదురుసన్నాహ మహోత్సవం (కన్యావరుణ సంవాదం) జరిగింది. తెలుగు పండితురాలు గాయత్రి దేవి పెండ్లి మాటలను భక్తులకు కళ్ళకు కట్టినట్లుగా వివరించారు.అనంతరం తిరువీధిలో రథోత్సవం జరిగింది. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత స్వామివారి ఉత్సవంలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. డి.ఎస్.పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిఐ కుమారస్వామి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది వెంకటేశ్వర స్వామి 152వ వార్షిక కళ్యాణ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త దొండా కన్నబాబు, ఈఓ టిఎన్ఎస్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా దొండా శ్రీరామ్‌చే కళ్యాణ వేడుకను జరిపించారు. వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు తిరువీదోత్సవం నిర్వహించిన అనంతరం గిరిజాంబ గిరిపై కళ్యాణ వేడుకను నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు కళ్యాణ వేడుక కొనసాగింది. రెండో రోజు మంగళవారం కూడా భక్తులు శ్రీవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, గీతాలు సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డొంకిన అప్పలనాయుడు, దొండ నరేష్ పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి పట్టణం దేముని గుమ్మం శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో వార్షిక కళ్యాణం సోమవారం రాత్రి కన్నులు పండుగగా జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తరపున జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఇఒ టి.రాజసులోచన, కళ్యాణకర్తలు పిల్లా, కరణం వారి కుటుంబ సభ్యులు, ధర్మకర్తలు గోలి మురళి, వేదుల సూర్యప్రభ, సిహెచ్ నర్సింగరావు, కొణతాల అరుణ, కొణతాల వాసు, సోమాదుల తులసి , భక్తులు పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- మాడుగుల:మాడుగులలో భారతనిర్మాణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన మోగా ఉచిత వైద్య శిబిరంకు విశేష స్పందన లబించింది. ఇండష్ ఆసుపత్రి, శంకర్ పౌండేషన్ ప్రముఖ వైద్యులు రోగులను పరీక్షించారు. బీసీ, షుగర్, కీళ్ల స్త్రీ ల సమస్యలు గుండెజబ్బులు, కంటి వైద్య పరీక్షలతో పాటు దీర్ఘకాళిక వ్యాధులను పరిశీలించి ఉచితంగా మందులు పంపిణి చేశారు. సుమారుగా ఈ శిబిరంకు 250 మంది వరకు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, మాజీ సర్పంచి దంగేటి సూర్యారావు, పుట్టా గంగయ్య, జిల్లా ఆర్యవైశ్య ఉపాధ్యక్షులు శ్రీనాథు శ్రీనివాసరావు, భారతనిర్మాణ సేవా ట్రస్ట్ ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

పట్టుబడ్డ ట్రాక్టర్

ప్రజాశక్తి -కోటవురట్ల: వరహానది సమీపం నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు రెవెన్యూ సిబ్బంది పట్టుకుని రూ.5000 జరిమానా విధించారు, అక్రమంగా ఇసుక తరలిస్తే ఉపేక్షించేది లేదని తహసిల్దార్ తిరుమల బాబు తెలిపారు. వరాహ నదిలో ఇసుక నిలువలు లేవని అధికారులు ధృవీకరించినా అక్రమంగా ఇసుక తరలించుకుపోవడం పట్ల సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

తవ్వేసి వదిలేసారు!

ప్రమాదాలకు నిలయంగా రహదారి మార్గం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమావేశ మందిరానికి వెళ్లే సిమెంట్ రోడ్డు ఎడ్జ్‌లో మట్టి తవ్వేసి వదిలేశారు. దీంతో ఆ మార్గాన వెళ్లే వారు పడిపోతున్నారు. సమీపంలో గల కార్యాలయ సముదాయాలకు వెళ్లే వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో రోడ్డు నిర్మించి గ్రావెల్ తో ఇంజనీరింగ్ అధికారులు ఎడ్జిలను పూడ్చారు. ఇటీవల మండల పరిషత్ అధికారులు తిరిగి రోడ్డును తవ్వేయడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎందుకు తవ్వారు అన్న దానికి సరైన కారణం కూడా అధికారులు చెప్పలేకపోతున్నారు, అధికారుల అనాలోచితం నిర్ణయానికి వాహన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి తవ్విన రోడ్డును త్వరగా పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఉన్న రహదారి

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:జివిఎంసి నెలనెలా క్రమం తప్పకుండా చెల్లించాల్సిన జీతాలను కొందరికి చెల్లించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. పలుమార్లు ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదు. ఈ పరిస్థితిలో, మంగళవారం జివిఎంసి జోన్ - 6, గాజువాక పరిధి వార్డు లలో పారిశుధ్య కార్మికులు జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. అధికారులకు తమ గోడు వినిపించేందుకు వచ్చిన వారు గంటల తరబడి నిరీక్షించవలసిన పరిస్థితి ఏర్పడింది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ పట్టాభిరామ్, జివిఎంసి ప్రధాన కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడేందుకు వచ్చారు. ఆయన వస్తున్న సమయంలో, అలాగే తిరిగి ఆయన వెళ్లే వరకు పారిశుధ్య కార్మికులు గేటు ముందు ఎండలో ఉండి నిరీక్షించే పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు మాట్లాడుతూ, కార్మికులకు ప్రతినెల జీతాలు మిస్సింగ్ అవుతున్నాయన్నారు. 2024 డిసెంబర్ నెల 64, 65,69 వ వార్డులలో 23 మంది కార్మికులకు, ఈ ఏడాది జనవరి నెల జీతాలు 64,69 వ వార్డు లకు ఇద్దరికీ రాలేదన్నారు. డే అండ్ నైట్ ప్యాకేజీ 24 నెంబర్ కార్మికులకు ఇన్ కమ్ టాక్స్ అమౌంట్ రాలేదన్నారు. 2022 నుండి 2024 సంవత్సరం వరకు మిస్సింగ్ జీతాలు 64,65,70,77 వార్డులకు చెందిన, ఎంఎస్ఎఫ్, డ్రైవర్స్ తదితరులు జీతాలు రాలేదన్నారు. జీతాలు చెల్లించాలని కోరేందుకు జివిఎంసి ప్రధాన కార్యాలయం చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గాజువాక జోన్ కు చెందిన నక్క నాగరాజు, కుమారి, వెంకటరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఎదురుచూస్తున్న కార్మికులు

వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగులలో సమస్యలపై వినతి

ప్రజాశక్తి- మాడుగుల:మాడుగుల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికతో ముందు అడుగులు వేయడం జరుగుతుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. మండలంలోని ఉన్న పెద్దేరు, తారకరామ జలాశయాలు మరమ్మత్తులు లైనింగ్ పనులు చేపట్టడం కోసం ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఛాంబర్‌లో రాష్ట్ర ఇరిగేషన్ ఉన్నతాధికారి వెంకటేశ్వరరావును కలవడం జరిగిందన్నారు. మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల భవన నిర్మాణ నిధులు మంజూరు గురించి విద్యాశాఖ అధికారులను, మాడుగుల మీదిగా ఆర్టీసీ బస్సు నడపడం కోసం రద్దు చేసిన నర్సీపట్నం టు ఘాటీరోడ్డు మీదిగా మాడుగుల బస్సు పునరుద్ధరుణ పై సబంధిత మంత్రిని కలిసి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. ఆయన వెంట మాడుగుల మండలపార్టీ అధ్యక్షులు అద్దిపల్లి జగ్గారావు, కార్యదర్శి ఉండూరు దేముడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు వడ్డి రాజ్కుమార్, మాడుగుల మండల క్లస్టర్ ఇంచార్జి పుప్పాల రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలని

గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం చీమల పాడు శివారు కొండ శిఖర గ్రామాల్లో నివాసం ఉం టున్న తమకు స్థానికంగా ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరుతూ గిరిజనులు వినూత్నం గా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ, చీమలపాడు పంచాయతీ కొండ శిఖర గ్రామాలైన నేరేడుబంద, జిలుగులోవ, సోంపురం బంధం గ్రామాల్లో 160 మంది గిరిజనులు నివాసం ఉంటున్నామన్నారు. ఏళ్ల పాటు కొండ పోడులు తయారీ చేసి సామలు, పసుపు, జీడి మామిడి, అల్లం పంటల సాగు చేస్తూ ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు . సరైన ఉపాధి లేక బయటకు వలసలు వెళ్లుతున్నామని, ఇక్కడే ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ జనవరి 22వ తేదీన అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించామన్నారు. దీనిపై అధికారులు స్పందించి తక్షణమే ఉపాధి పనులు కల్పించాలని ఆదేశాలు జారీ చేసారని, ఇప్పటికీ పనులు కల్పించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి ఉపాధి పనులు తక్షణమే కల్పించాలని, లేని పక్షంలో ఈ నెల 25వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధిత గిరిజనులతో ఆందోళన చేస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు స్పష్టం చేశారు.

నిరసన చేపడుతున్న గిరిజనులు

లైటు వెలగడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న కుటుంబీకులు

గిరిజన గ్రామంలో విద్యుత్ వెలుగులు

- ఫలించిన సిపిఎం పోరాటం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం చీమల పాడు శివారు కొండ శిఖరం గిరిజన గ్రామం సోంపురం బందలో విద్యుత్ వెలుగులు విరజిల్లాయి. దీనికోసం గత ఐదు ఏళ్ళు గా గిరిజనులు సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేశారు. ఈ సందర్బంగా స్థానిక గిరిజనులు మాట్లాడుతూ, గతంలో కాగడాల వెలుతురులో భోజనం చేసేవారమన్నారు.విద్యుత్ సౌకర్యం కల్పించిన అధికారులకు సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు కె గోవిందరావు ధన్యవాదాలు తెలిపారు.

బిజెపితో రాజ్యాంగానికి భంగం

-కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉండటంతో రాజ్యాంగానికి భంగం కలిగించే విధంగా అనేక చర్యలు చేపడుతుందని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు ఆరోపించారు.ఈ సమయంలో దేశవ్యాప్తంగా రాజ్యాంగ రక్షణ కోసం పోరాటం చేయక తప్పదని అన్నారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134 వ జయంతోత్సవాల్లో భాగంగా కెవిపిఎస్ ప్రచార కార్యక్రమం మంగళవారం 28 వ వార్డు భానోజీ నగర్ ప్రాంతంలో నిర్వహించారు. ప్రజలలో రాజ్యాంగం పట్ల అవగాహన కలిగిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళు లర్పించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాజు మాట్లాడుతూ, దేశంలో ఎన్నడూ లేనంతగా రాజ్యాంగ పరిరక్షణ ఇప్పుడు కీలకంగా మారిందన్నారు.బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్ఎస్ఎస్ సంఘపరివార్ ఆడిందే ఆటగా రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ మనువాద స్ఫూర్తి ఎజెండాను ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కాలంలో మైనార్టీ మతాలపై దాడులు, దళితులు, అనగారిన వర్గాలపై అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. స్వతంత్ర దర్యాప్తు సంస్థలను, ఆఖరికి ఎలక్షన్ కమిషన్ ను కూడా బిజెపి ప్రభుత్వం ప్రభావితం చేస్తూ తన హిందుత్వ ఎజెండాని ముందుకు తీసుకెళ్తుందని విమర్శించారు. సినిమా నటుల ద్వారా,సినిమాల ద్వారా, గుళ్లను తమ హిందుత్వ ఎజెండాకు కేంద్రాలుగా మార్చుకొని సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో ప్రజలను ప్రలోభ పెట్టి రెచ్చగొట్టే కుట్రలు జరుగుతున్నాయన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని నిలబెట్టుకోవడానికి కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రాజ్యాంగ పరిరక్షణ వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎం.సుబ్బారావు, కె. నరసింగరావు, కె.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజు

ఘనంగా పట్టాలమ్మ తీర్థం

ప్రజాశక్తి -రావికమతం: మండలంలోని బుడ్డి బండ గ్రామంలో పట్టాలమ్మ తల్లి తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు మంగళవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందజేస్తున్న పలు రకాల సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే పింఛన్లు, ఉచిత గ్యాస్ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. మిగిలిన పథకాలను కూడా త్వరలో అమలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పలువురు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రాజన కొండ నాయుడు, చినపాచిల సర్పంచ్ శంకర్రావు, రావి కమతం సర్పంచ్ మోది నాయుడు, తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ, తదితరులు పాల్గొన్నారు.

15న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి- పాడేరు : ఈ నెల 15వ తేదీన పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ చాంబర్ లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన మెగా జాబ్ మేళా పోస్టర్ ను కలెక్టర్ విడుదల చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అత్యంత ప్రతిష్ట గల సుమారు 28 సంస్థలు ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొని వారికి అవసరమైన నిరుద్యోగ అభ్యర్థులను ఎంపిక చేసి వెంటనే వారికి నియామక ఉత్తర్వులు అందజేస్తారని ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18ఏళ్ళు నిండిన పదవ తరగతి ఆ పైన చదివిన వారు అర్హులన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

సామగ్రిని ఇస్తున్న గ్రామ పెద్దలు

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్:గొలుగొండ మండలం ఏఎల్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 140 మంది విద్యార్థులకు స్థానిక శ్రీ అల్లూరి వర్తక సంఘం సభ్యులు పరీక్షల స్టేషనరీ అందజేశారు. అనంతరం పెద్దలు మాట్లాడుతూ, పదవ తరగతి పరీక్షలు బాగా రాసి గ్రామానికి, స్కూల్ కి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎక్కువ మార్కులు వచ్చిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రరావు, నానిబాబు, జోగుబాబు, జోగునాదం, రామకృష్ణ, చక్రి, శివ ,లక్ష్మి పాల్గొన్నారు.

విచారణ చేస్తున్న ఆర్‌డిఒ

పనసలపాడులో ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి-రోలుగుంట:జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాల మేరకు నర్సీపట్నం ఆర్డీవో వివి.రమణ రోలుగుంట మండలం పనసలపాడు గ్రామంలో విచారణ చేపట్టారు. సర్వే నెంబరు 1.6-1.0లో భగతకు చెందిన 12 కుటుంబాలకు జగనన్న భూముల పట్టాదారు పాసు పుస్తకాలు గతంలో ఇచ్చారు. దీనిపై మానవహక్కులకు ఫిర్యాదు అందటంతో ఈ విచారణ చేపట్టారు. ఈ మేరకు రికార్డులు పరిశీలించారు. వాటి వివరాలను అందజేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా సీపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు మాట్లాడుతూ, గిరిజనేతరులకు ఇచ్చిన పట్టాలను తక్షణమే రద్దు చేయాలన్నారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.